సాక్షి జగిత్యాల

మంగళవారం ♦ 1 ♦ జూలై ♦ 2025

దుబాయ్‌లో ఘనంగా బోనాలు

రాయికల్: దుబాయ్‌లోని ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంక్షేమ సంఘం (ఈటీసీఏ) ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ బోనాల పండుగను మైత్రి ఫర్మ్ అజ్మాలో ఘనంగా నిర్వహించారు. మహిళలు గౌరిదేవీకి పూజలు నిర్వహించిన అనంతరం బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పోతురాజుల వేషధారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవస్థాపకులు పీచర్ల కిరణ్‌కుమార్, అధ్యక్షుడు చీటి జగదీశ్‌రావు, ఉపాధ్యక్షులు ఎలిగేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోట్ల రాణి, సంయుక్త కార్యదర్శి శేఖర్‌గౌడ్, కోశాధికారి తిరుమల్‌గౌడ్, మహిళ సభ్యులు కస్తూరి మమత, పీచర్ల సారిక, అన్నపూర్ణ, సరోజ, జల, రనీష, స్వప్న, ప్రియ, విపుల, చంద్రలేఖ, లక్ష్మి, శ్వేత, సుమజ, రమ్య, సంగీత పాల్గొన్నారు.



పిల్లల చేయిపట్టి.. సర్కార్ బడికి జైకొట్టి

• తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు • స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం.. గవర్నమెంట్ టీచర్లపై భరోసా పెంచాలనే పలువురు ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని చెప్పేందుకే తాము పనిచేస్తున్న స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్తున్నారు. సార్లే.. తమ పిల్లలను ఊరిలోని బడికి తీసుకొస్తుంటే.. మిగతా తల్లిదండ్రులు తమ పిల్లలనూ చేర్పిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఇదే కారణం. తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్న ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు.



కొడుకు అయాన్ అద్వైత్‌కు పుస్తకాలు అందజేస్తున్న తండ్రి భూక్య తిరుపతి

బడిపై నమ్మకం కల్పించాలని

రుద్రంగి(వేములవాడ): తన ముగ్గురు పిల్లలనూ సర్కార్ స్కూళ్లలోనే చదివిపిస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం వీరునితండాకు చెందిన టీచర్ భూక్య తిరుపతి. రుద్రంగి ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్య తిరుపతికి భూక్య ప్రీతిజ, భూక్య నిహారిక, భూక్య అయాన్ అద్వైత్ పిల్లలు. నిహారికను గతంలో తాను పనిచేసిన రుద్రంగి ప్రైమరీ స్కూల్‌కు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం మానాలలోని స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి తన కొడుకు అయాన్ అద్వైత్‌ను అదే పాఠశాలకు వెంట తీసుకెళ్తున్నారు. ఇద్దరు కూతుళ్లు భూక్య ప్రీతిజ 10వ తరగతి, భూక్య నిహారిక 7వ తరగతి.. గురుకులాల్లో చదువుతున్నారు.

తల్లిదండ్రుల బడికి కొడుకు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం దుంపేటకు చెందిన గుండేటి రవికుమార్–పద్మలత దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు మండలంలోని పోసానిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతుల చిన్నకుమారుడు లౌకిక్ నాలుగో తరగతి వారు పనిచేస్తున్న పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నాడు. నిత్యం తమ వెంటే స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలకు పంపడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.



తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలని..



పిల్లలతో స్రవంతి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన స్రవంతి కరీంనగర్‌రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. స్వస్థలం పెద్దపల్లి జిల్లా ధూళికట్ట కాగా కరీంనగర్‌లో నివాసముంటున్నారు. భర్త శ్రీకాంత్ ల్యాబ్ టెక్నీషియన్. కూతురు అమూల్య 6వ తరగతి, కుమారుడు సాయిమోక్షిత్ 4వ తరగతి చదువుతున్నారు. గతంలో వీరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువగా.. ప్రస్తుతం తల్లి వెంటే చెర్లభూత్కూర్ ప్రభుత్వ బడికి వెళ్తున్నారు. గ్రామంలోని తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపై నమ్మకం కల్పించేందుకు తన పిల్లలనూ అక్కడే చదివిపిస్తున్నట్లు టీచర్ స్రవంతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలు



బైక్‌పై పాఠశాలకు తీసుకొస్తున్న అనిల్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మండలం న్యూమారేడుపాక లోని నర్సింహపురం(ఎంపీపీఎస్) ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు వి.అనిల్‌కుమార్ తన ఇద్దరు కుమారులను అదే పాఠశాలలో చదివిపిస్తున్నారు. పెద్దకుమారుడు శ్రీహాన్ 5వ తరగతి, చిన్నకుమారుడు 2వ తరగతి చదువుతున్నారు. వారిద్దరిని నిత్యం తనతోపాటు బైక్‌పై ప్రభుత్వ బడికి తీసుకొస్తున్నాడు. తను పనిచేస్తున్న పాఠశాలలోనే ఇద్దరు పిల్లలను చదివిపిస్తూ.. గ్రామంలోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచినట్లు టీచర్ అనిల్‌కుమార్ తెలిపారు.

- వివరాలు 8లో ▶

న్యూస్‌రీల్

బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం



పోలీస్ గ్రీవెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మందినుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్పీ వారితో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

• అదనపు కలెక్టర్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని అదనపు కలెక్టర్ లత అన్నారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 23,400 కొత్త రేషన్‌కార్డులు, 46,884 మందిని కార్డుల్లో నమోదు చేశామని తెలిపారు. రేషన్‌కార్డు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. 592 దుకాణాల ద్వారా మూడునెలలకు సంబంధించిన సన్నబియ్యం పంపిణీ చేశామన్నారు. గత వానాకాలం, యాసంగి సీజన్‌లో 6,437 ఏసీకేలు బకాయిలు ఉండగా.. రైస్‌మిల్లర్స్‌తో సమీక్షించి 14,481 ఏసీకేలు ప్రభుత్వానికి చెల్లించామన్నారు. ధాన్యం దిగుబడి గతంలో కంటే 50వేల టన్నులు అదనంగా వచ్చిందని, రైస్‌మిల్లులకు తరలించి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసి వారి అకౌంట్లలో జమ చేశామన్నారు. పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, అక్రమ నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సోమవారం సమావేశమైంది. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలని సూచించారు. అట్రాసిటీ బాధితులకు నిధులు మంజూరు చేస్తున్నామని, అదేస్థాయిలో కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అట్రాసిటీ బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన రూ.2కోట్ల కోసం ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీలు ఇబ్బంది పడుతున్నారని, మంత్రి సహకారంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలని దీక్ష



శాంతియుత దీక్షలో ఉద్యమకారులు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ కోరారు. ఫోరం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శాంతియుత దీక్ష చేపట్టారు. వీరికి ఉద్యమ జేఏసీ నాయకులు చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్‌శర్మ మద్దతు తెలిపారు. తెలంగాణ కోసం కవులు, కళాకారులు, ఉద్యమకారులు అహర్నిశలు కృషి చేశారని, వారి అండతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. జవ్వాజి శంకర్ మాట్లాడుతూ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. 250 చదరపు గజాల స్థలం, 25వేల పెన్షన్, హెల్త్‌కార్డులు అందించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ రాగుల రాజు, ప్రధాన కార్యదర్శి భారతపు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలాస పరిశోధన స్థానం డైరెక్టర్‌గా హరీశ్‌కుమార్

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్‌గా హరీశ్‌కుమార్ శర్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన శ్రీలతను యాదాద్రిభువనగిరి డాట్ సెంటర్‌కు బదిలీ చేశారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న సైదానాయక్‌ను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. పరిశోధన స్థానంలో పనిచేస్తున్న పలువురు శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు.

కనిపించని ‘ఊయల’

• అనాథ శిశువుల కోసం యంత్రాంగం నిర్ణయం
• ఏర్పాట్లలో జిల్లా అధికారులు తీవ్ర జాప్యం
• శిశువు వద్దనుకుంటే ‘ఊయల’లో వదిలి వెళ్లవచ్చు

జగిత్యాల: అనాథలైనా.. పిల్లలు వద్దనుకునే తల్లులైనా తమ పిల్లలను వేసి వెళ్లడానికి ఆస్పత్రుల వద్ద ఊయల ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ ఊయల కార్యక్రమం కరీంనగర్‌లో విజయవంతం కావడంతో జగిత్యాలలోనూ ఏర్పాటు చేయాలని భావించారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడలేదు. పేదరికం, ఇతరత్రా కారణాలు, ఆడపిల్ల అనే ఉద్దేశంతో కొందరు తల్లిదండ్రులు శిశువులను చెత్తకుప్పలు, డ్రైనేజీల్లో పడేసి వెళ్లిన ఘటనలు చోటుచేసుకుంటున్న తరుణంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఊయలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆస్పత్రితోపాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ సామాజిక ఆస్పత్రుల వద్ద ఊయలను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. పుట్టిన శిశువు వద్దనుకుంటే ఆ ఊయలలో వదిలివెళ్లే అవకాశం ఉంది. అక్కడ సీసీ కెమెరాలుగానీ, నిఘా ఏమీ ఉండదు. శిశువును వదిలి వెళ్లిన వారి సమాచారం కూడా సేకరించరు. అందులో వదిలివెళ్లిన శిశువును మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారు స్వీకరించి వారి ఆలనాపాలన చూసుకునేలా వెసులు బాటు కల్పించారు. ఎవరైనా ముందుకొస్తే నిబంధనల ప్రకారం దత్తత ఇస్తారు.



ఆస్పత్రుల వద్ద ఏర్పాటు చేయనున్న ఫ్లెక్సీ

ఏర్పాటుకు చర్యలు



జిల్లాలో ఊయల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆస్పత్రులను గుర్తించాం. త్వరలోనే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఊయలను ప్రారంభిస్తాం. శిశు గృహం లేకనే కొంత ఇబ్బందిగా ఉంది.

– బోనగిరి నరేశ్, శిశు సంక్షేమ శాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలోనే శిశు గృహం

ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోనే శిశు గృహం ఉండటంతో జిల్లాలోని ఆస్పత్రుల వద్ద ఊయల ఏర్పాటు జాప్యమవుతోందని తెలుస్తోంది. శిశువులను చేరదీసిన అనంతరం వారు శిశు గృహాలకు పంపించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఊయల ఏర్పాటు చేస్తే ఎవరైనా పిల్లలను వదిలివెళ్తే వారిని చేరదీసి కరీంనగర్‌కే పంపించాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాకేంద్రంలో ఊయల ఏర్పాటు చేసేందుకు మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్కడ ఓ ఏఎన్‌ఎంను నియమించనున్నారు. పిల్లలను వదిలి వెళ్లగానే చిన్నారి పూర్తి సంరక్షణ వారే చూసుకుంటారు. ఏదైనా అవసరం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1098, 112 నంబర్లకు కాల్‌చేయవచ్చు.

ప్రజావాణికి 37 దరఖాస్తులు

• అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్
• పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు భారీగా తరలివచ్చారు. వారి నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. 37మంది దరఖాస్తులు సమర్పించగా.. వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్‌గౌడ్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మసీదుకు స్థలం కేటాయించండి



నూకపెల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో మసీదు నిర్మాణానికి స్థలం కేటాయించండి. ఇళ్లు పొందిన ముస్లిం కుటుంబాలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా కాలనీ పరిసరాల్లో మసీదుకు స్థలం కేటాయించండి.

– మహ్మద్ అబ్దుల్ భారీ, ముస్లిం సదర్

ప్లాట్లు కబ్జా చేస్తున్నారు



మాది వెల్గటూర్ మండలం ముక్కట్రావుపేట. 97 ఇళ్లు ఎల్లంపల్లిలో ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం కొంతమందికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్లాట్లు కేటాయించింది. 2015 నాటికి 18ఏళ్లు నిండిన యువతకు ప్లాట్లు, డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు రాలేదు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మిగిలిన ప్లాట్లను కొందరు కబ్జా చేస్తూ గుడిసెలు వేస్తున్నారు. వాటిని తొలగించి లబ్ధిదారులమైన మాకు అప్పగించండి.

– ఎల్లంపల్లి ప్రాజెక్టు బాధితులు, ముక్కట్రావుపేట

అసంపూర్తి రోడ్డుతో ప్రమాదాలు



మల్యాల బ్లాక్ ఆఫీస్ నుంచి పెగడపెల్లి వరకు ప్రారంభించిన రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కంకర, డస్ట్ పోసి వదిలేశారు. దుమ్ము కొట్టుకొచ్చి ఇళ్లలోకి చేరుతోంది. రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– మల్యాల గ్రామ ప్రజలు

హద్దు రాళ్లు తొలగిస్తున్నారు



జిల్లాకేంద్రంలోని ఎల్ఎల్ గార్డెన్ నుంచి ధన్వంతరి ఆలయానికి వెళ్లే దారిలోని సర్వేనంబర్ 1429లోగల 8.05 ఎకరాలకు హద్దురాళ్లను కొందరు తొలగిస్తున్నారు. మా తాత అంగడి భూమయ్య నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి హద్దు రాళ్లు తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

– అంగడి రాజు, మేడిపల్లి

బకాయిలు చెల్లించాలంటున్నరు



బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువుతున్న మా పిల్లలను యాజమాన్యాలు అనుమతించడం లేదు. ఫీజు బకాయిలు చెల్లించాలంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను ప్రభుత్వానికి నివేదించి మా పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా చూడండి.

– బీఏఎస్ స్కూల్స్ విద్యార్థుల పేరెంట్స్

ఇంట్లోకి నీరు వస్తోంది



యావర్‌రోడ్డులో డ్రైనేజీ సరిగా లేక చిన్నపాటి వర్షానికే మురుగు నీరు ఇంట్లోకి చేరుతోంది. వర్షం వస్తోందంటేనే భయభ్రాంతులకు గురవుతున్నం. డ్రైనేజీని సరిచేసి ఇళ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోండి.

– అక్కినపెల్లి కాశీనాథం, యావర్‌రోడ్డు జగిత్యాల

‘ఇందిరమ్మ ఇళ్ల’కు రూ.లక్ష రుణం

• ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి సెర్ప్ ద్వారా రూ.లక్ష రుణం అందించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ రూ.12.48 లక్షలు, కల్యాణలక్ష్మి రూ.31లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణం ఆర్థిక కారణాలతో జాప్యం జరగొద్దన్న ఉద్దేశంతో మహిళా సంఘాల నుంచి రుణం అందిస్తామని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పెంబట్ల బీరయ్య ఆలయ నిర్మాణానికి సీజీఎఫ్ కింద రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ ఎండి.వాహీదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్, ఆర్‌ఐ వెంకటేశ్, ఎంపీవో సలీం పాల్గొన్నారు.

జగన్నాథపూర్ బ్రిడ్జి కోసం కృషి

రాయికల్: రాయికల్ మండలం బోర్నపల్లి–జగన్నాథపూర్ గ్రామాల మధ్య బ్రిడ్జి కోసం సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులను కలిశానని ఎమ్మెల్యే అన్నారు. బ్రిడ్జి మంజూరు కావడంపై జగన్నాథపూర్, బోర్నపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు. రూ.4 కోట్లతో జగన్నాథపూర్‌లో చెక్‌డ్యాం నిర్మాణంతో వందలాది ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. గిరిజన, ఆదివాసుల నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు కోల శ్రీనివాస్, పాదం రాజు, కవిత, శ్రీనివాస్, గంగారాం, శంకర్, తులసి, అనిల్, నారాయణ, కాటిపల్లి గంగారెడ్డి, మద్రిపల్లి శ్రీనివాస్, గన్నె రాజిరెడ్డి, చంద్రశేఖర్, అనుపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 20 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సూచించారు. 35వ వార్డులో సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, లక్ష్మణ్, బాలె శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన పాత డీఎంహెచ్‌వో డాక్టర్ సమీయొద్దీన్, ధర్మపురి నీటిపారుదల శాఖ ఈఈ నారాయణరెడ్డిని సత్కరించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్, చక్రునాయక్, డాక్టర్ శ్రీనివాస్, జైపాల్, రాంచందర్‌రావు పాల్గొన్నారు.

నిరుపేద బాలుడి వైద్యానికి రూ.1.13లక్షల సాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

ధర్మపురి: కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో కొట్టుమిట్టాడుతున్న ఓ నిరుపేద బాలుడి వైద్యం కోసం ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.13లక్షలు విరాళాలుగా అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన మద్దిరాల మనోహర్, సరిత దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. మనోహర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఆర్నెళ్ల క్రితం కుమారుడు రిత్విక్ క్యాన్సర్ బారిన పడడంతో వైద్యం చేయించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. అక్కడి సామాజిక మిత్రుల ద్వారా తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ బాలుడి వైద్య ఖర్చులకు సాయం అందించాలని జూన్ 5న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. బాలుడి తల్లి బ్యాంకు ఖాతాను అందులో పొందుపర్చాడు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, దాతలు స్పందించి సరిత బ్యాంకు ఖాతాకు రూ.1.13 లక్షలు విరాళాలు పంపించారు. ఆ డబ్బులను బ్యాంకు మేనేజర్ చేతులమీదుగా బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. దాతల విరాళాలతో వైద్య సేవలు కొనసాగుతున్నట్లు రమేశ్ తెలిపారు.

మీసేవ కేంద్రాలకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలో కొత్తగా మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. బీర్‌పూర్, జగిత్యాలఅర్బన్, సారంగాపూర్, కొడిమ్యాల, కోరుట్ల, వెల్గటూర్, మెట్‌పల్లిలో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హులు WWW.JAGTIALTELANGANA.GOV.IN లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లు జతచేసి ఈనెల 15లోపు తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

• మరో ఇద్దరికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట శివారు రాజీవ్ చౌరస్తా వద్ద ధర్మపురి–జగిత్యాల ప్రధాన రహదారిపై ఓ ప్రైవేటు బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో దుమ్మల రాజేశ్ (24) మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ మండలం చెర్లపల్లికి చెందిన రాజేశ్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడం.. అతడి మిత్రుడు కార్తీక్ ఇంట్లో శుభకార్యం ఉండడంతో గడ్డం సుమన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. రాత్రి సమయంలో రాజేశ్, సుమన్, కార్తీక్ ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. రాజీవ్ చౌరస్తా వద్ద ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సు సడెన్‌గా బ్రేక్ వేయడంతో రాజేశ్ నడుపుతున్న ద్విచక్ర వాహనం బస్సుకు ఢీకొంది. ఈ ఘటనలో రాజేశ్ తలకు బలమైన గాయాలయ్యాయి. సుమన్, కార్తీక్ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. రాజేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. రాజేశ్‌కు కుమారుడు ఉన్నారు.

మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డిపై కేసు కొట్టివేత

కరీంనగర్‌క్రైం: కోర్టు ఆవరణలో సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసును సోమవారం కరీంనగర్ పీసీఆర్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది. 2017లో దాఖలైన ఫైనాన్స్ కేసులలో సాక్షులను కోర్టు ఆవరణలో బెదిరించారని కామారపు జ్ఞానేశ్వర్ 2017 నవంబర్ 24న మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డి, లత, బానాల రమణారెడ్డి, అజీజ్, చెక్కుల రాజమల్లు, శ్రీపాల్‌రెడ్డిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ పూర్తికాగా సాక్ష్యాధారాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితులుగా ఉన్న మోహన్‌రెడ్డితో పాటు మిగితా వారందరిపై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

పిల్లల చేయిపట్టి.. సర్కార్ బడికి జైకొట్టి

తాము పనిచేస్తున్న సర్కార్ స్కూళ్లపై నమ్మకం పెంపొందించడం.. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా టీచర్లు తమ పిల్లలను తమతో పాటే తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ కొలువు చేస్తూ ప్రైవేట్ స్కూళ్లకు పంపడం సరికాదని.. సర్కార్ స్కూళ్లలో చేర్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని.. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోందంటూ టీచర్లు చాటిచెబుతున్నారు. పిల్లలను తాము పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు.

• ప్రభుత్వ పాఠశాలకు పంతుళ్ల పిల్లలు • నమ్మకం కల్పిస్తున్న టీచర్లు
• స్ఫూర్తి పొందుతున్న తల్లిదండ్రులు • సర్కార్ స్కూళ్లలో పెరుగుతున్న ప్రవేశాలు



తల్లిదండ్రులతోనే కూతురు



ప్రభుత్వ ఉపాధ్యాయులు పుర్రె రమేశ్, కవిత కూతురు ఆరాధ్య

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన పుర్రె రమేశ్, కవిత దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రమేశ్ రాయికల్ హైస్కూల్‌లో పీడీగా, కవిత రాయికల్ మండలం ఇటిక్యాలలోని ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి కూతురు ఆరాధ్యను వారు పనిచేస్తున్న స్కూల్‌లో చేర్పించారు. మొదట్లో కవిత పనిచేసిన భూపతిపూర్‌లో ఆరాధ్యను ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు చదివించారు. ప్రస్తుతం ఇటిక్యాలలో 4వ తరగతిలో చేర్పించారు.

తల్లీకొడుకులు ఒకే బడికి..



కుమారుడు శ్రేయాన్‌తో టీచర్ శ్రీలక్ష్మి

కోరుట్ల: ఈ తల్లులు ప్రభుత్వ టీచర్లు. తమ పిల్లలను సైతం వారు పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీలక్ష్మి తన కుమారుడు శ్రీయాన్‌ను అదే స్కూల్‌లో 4వ తరగతిలో చదివిపిస్తున్నారు. నిత్యం తనతోపాటు స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో స్వేచ్ఛాపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం సాగుతోందని, అప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు.



కుమారుడిని బైక్‌పై స్కూల్‌కు తీసుకెళ్తున్న రాజమణి

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం మాదాపూర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఎలిగేటి రాజమణి తన కుమారుడిని అదే పాఠశాలలో చదివిస్తోంది. కోరుట్లకు చెందిన రాజమణి తన కొడుకు హిమాన్ష్‌ను తాను పనిచేస్తున్న స్కూల్‌లోనే 3వ తరగతిలో చేర్పించింది. నిత్యం బైక్‌పై కొడుకును తీసుకొని స్కూల్‌కు వెళ్లి వస్తోంది. రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో పనిచేసే సమయంలోనూ తన కొడుకును తీసుకెళ్లేవారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన అందుతుండడంతోనే తీసుకెళ్తున్నట్లు రాజమణి తెలిపారు.

పిల్లలనూ సర్కార్ బడికే..



భార్య, పిల్లలతో టీచర్ యామ రాజు

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి యామ రాజు తన ఇద్దరు కూతుళ్లను ప్రభుత్వ బడిలోనే చేర్పించారు. రాజు కూతుళ్ల యామ ధీరజ, తనూజ మండలంలోని రహీంఖాన్‌పేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. పెద్ద కూతురు ఇంటర్‌లో 987 మార్కులు సాధించి ప్రస్తుతం కోఠిలోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో చేరింది. చిన్నకూతురు తనూజ మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది.

నాన్న వెంటే పిల్లలు



పిల్లలతో ఉపాధ్యాయుడు సత్యనారాయణ

కరీంనగర్‌స్పోర్ట్స్: తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను తీసుకెళ్తున్నారు ఈ తండ్రులు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సర్కార్ బడులకు పంపుతున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన సత్యనారాయణ ప్రస్తుతం వేములవాడలోని జెడ్పీ హైస్కూల్(బాలికలు)లో విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సంక్షోభానికి ముందు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ పిల్లలనూ అక్కడే చదివిపించేవారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడంతో తాను పనిచేస్తున్న స్కూల్‌కే తన పిల్లలను తీసుకెళ్తున్నారు. పెద్ద కూతురు అనన్య ప్రభాస 8వ తరగతి, చిన్నకూతురు ప్రవస్థి 5వ తరగతి చదువుతున్నారు.



పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు సతీశ్, అతని కుమారుడు వరుణ్‌తేజ్.

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న లింగంపేట సతీశ్ తన కొడుకు వరుణ్‌తేజ్ అదే స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు.



కుమారునితో పాఠశాలకు వస్తున్న తీపిరి సంజీవ్

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన తీపిరి సంజీవ్ స్థానిక మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నారు. తన కుమారుడు జయసూర్యని కూడా అదే పాఠశాలలో రెండో తరగతి చదివిస్తున్నారు. ప్రతి రోజూ తండ్రీకొడుకులు బైక్‌పై స్కూల్‌కు వెళ్లి వస్తున్నారు.



ధర్మపురి మండలంలోని రాయపట్నం ప్రభుత్వ పాఠశాలకు తన కొడుకును తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు రాజు

ధర్మపురి: ధర్మపురి మండలం రాయపట్నం స్కూల్‌లో పనిచేస్తున్న బండారు రాజు తన కొడుకు రోహన్‌ను అదే బడిలో 3వ తరగతిలో చేర్పించారు. గతంలో వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో పనిచేసిన సమయంలో తన వెంటే కొడుకును తీసుకెళ్లారు.



పిల్లలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జావెద్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జావెద్ తన పిల్లలను అదే బడిలో చదివిపిస్తున్నారు. తన పెద్ద కొడుకు నవీదుల్ రెహమాన్‌ను అదే స్కూల్‌లో 7వ తరగతి, చిన్న కొడుకు టిప్పు ఉల్ రహమాన్‌ను దుర్గయ్యపల్లి స్కూల్‌లో 4వ తరగతిలో చేర్పించాడు.

బోధనపై నమ్మకంతో..



తన కూతురు మధురిమను 9వ తరగతిలో చేర్పించిన ఆదర్శ ఉపాధ్యాయుడు కిష్టయ్య

వేములవాడ: కథలాపూర్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ కిష్టయ్య తన కూతురు మధురిమను వేములవాడలోని బాలికల హైస్కూల్‌లో చేర్పించారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందనే చేర్పించినట్లు కిష్టయ్య పేర్కొన్నారు.

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలలో బోధనపై నమ్మకం కల్పించేందుకు తన కుమారుడిని చేర్పించినట్లు టీచర్ బానోత్ సత్యజోస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలోని స్కూల్‌లో సత్యజోస్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జమ్మికుంటలో ఉంటున్నారు. ఏడాది క్రితం బదిలీపై పర్లపల్లి పాఠశాలకు వచ్చారు. తన కొడుకు బానోతు సుశాంత్‌ను జమ్మికుంట హైస్కూల్‌లో 9వ తరగతిలో చేర్పించారు.

విద్య వ్యాపారం కాదని..



నర్సింహులపల్లి స్కూల్‌లో దింపుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మధుసూదన్

సారంగాపూర్: ప్రస్తుతం విద్యను వ్యాపారం చేశారని.. కాదని చెప్పేందుకే తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిపిస్తున్నట్లు గొడుగు మధుసూదన్ తెలిపారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లికి చెందిన మధుసూదన్ కండ్లపల్లిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పెద్ద కుమార్తె నిత్య 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో చేరింది. చిన్న కూతురు శ్రీనిధి నర్సింహులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కండ్లపల్లిలో విధులు నిర్వహిస్తూనే నర్సింహులపల్లిలోని స్కూల్‌కు వెళ్లి అదనంగా ఒక పీరియడ్ బోధిస్తున్నారు మధుసూదన్.

చికిత్స పొందుతూ వలసజీవి మృతి

• ఈనెల 3న గల్ఫ్ వెళ్లేందుకు ఏర్పాట్లు
• అంతలోనే కుటుంబంలో విషాదం



ప్రతాప్‌రెడ్డి(ఫైల్)

కథలాపూర్: మండలంలోని దుంపేటకు చెందిన పాట్కురి ప్రతాప్‌రెడ్డి (58) గతనెల 28న మెట్లపై నుంచి పడి గాయపడగా.. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ప్రతాప్‌రెడ్డి ఈనెల 3న మస్కట్ దేశం వెళ్లాల్సి ఉంది. అంతలోనే మృత్యువాతపడటంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం దుంపేటకు చెందిన ప్రతాప్‌రెడ్డి కొన్నాళ్లుగా మస్కట్ వెళ్లి వస్తున్నాడు. నాలుగు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చారు. తిరిగి ఈనెల 3న మస్కట్ వెళ్లడానికి టికెట్ బుక్ చేసుకున్నాడు. ఈ క్రమంలో జూన్ 28న ప్రతాప్‌రెడ్డి తన ఇంటిపై నుంచి మెట్ల ద్వారా దిగుతుండగా.. జారిపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రతాప్‌రెడ్డికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ వివరించారు.